మేడ మెట్లు

అధికారి, ఎల్లాగో మూడు మెట్లూ ఎక్కి, వరండా లోకి చేరుకున్నాడు. ఆయన తొడుక్కున్న మూసేసిన కంఠి మెడకోటుకి ఏడు బొత్తాము లుంటాయి; వాటిల్లో పై రెండూ వూడదీసేటప్పటికి, ఆయన వోపికంతా అయిపోతుంది. బొత్తాములూ, కోటూ, టై, కాలర్-యివన్నీ నాగరికత తగిల్చిన శృంఖలాలు; సంస్కారానికి మానవుడు చెల్లించే సుంకం. అల్లా అనేటందుకు అర్హత వుండాలంటే, ఆశృంఖలాలు తగుల్చుకోవాలి... లేకపోతే ఆ నిర్వచనానికి విలువ ఏమీ వుండదు. 'ఈ జగత్తంతా మాయ, ఏదో యథార్థం తగులడింది. అదేవిటో నాకు తెలిసి చావదు'—అని ఇంగ్లీషులో ఆరొందల పేజీల గ్రంథం వ్రాసినందుకు, గ్రంథకర్తకి డాక్టరేట్ బిరుదు తగిలించి, ఏ విశ్వవిద్యాలయానికో అధిపతిని చేసేవరకూ సంఘం వూరుకోదు. 'ఏమిజన్మం బేమిజీవనమూ' అని థర్డ్ క్లాస్ కంపార్టుమెంటులో పాడుకుంటూ కాసికి చెయ్యిచాచే ముష్టి కుర్రాణ్ణి, కంచి అవతలికి నెట్టేస్తారు, అదేం చిత్రమో! వాడికి వూడని బొత్తాములకోటు లేదు గనకా?

అనుకుంటూ అధికారి బొత్తాములన్నీ వూడదీసి, కోటు విప్పి, కర్రని మూలకి గెంటి కుర్చీలో కూలబడ్డాడు. వెంటనే ఏదో మరిచిపోయిన సంగతి జ్ఞాపకంవొచ్చింది. మూడు నిముషా లాలోచించాడు. ఆ మెట్లగదిలో బల్లమీద పత్రిక తీసుకురావడం. లోపలికి చూచాడు. బల్లమీద గడి

యారం కనబడుతోంది. టైము తెలీదు. చూడాలంటే కళ్ల జోడు కోటుజేబులో వుంది. 'హాసీ' అని కేకేశాడు. 'హాసీ'కి చిన్న చిన్న వొస్తువులు నోట్లోకరుచుకునిపట్టుకురావడం నేర్పి వుంటే ఎంత బాగుండును! 'హాసీ' తోక కిందికిదించేసి, మెట్ల మీద గంతులేస్తోంది. లోపలికి చూపించి 'ఆ పేపరల్లా తీసుకురా' అని సంజ్ఞచేశాడు. 'హాసీ' మూలనున్న కర్రని నోట్లో కరుచుకుని మెట్లెక్కి పైకి వెళ్ళిపోయింది. ఆ కర్రని తన కిచ్చినా బాగుండును: దాని సహాయంతో లోపలి కెళ్ళి పత్రిక తీసుకొచ్చి, చదువుకుంటూ కూర్చుండును. నిజంగా జీవితంలో సంతోషం కలగజేసేవి ఇట్లాంటి స్వల్పవిషయాలే. రోజూ ఎనిమిదింటికి హాజరయ్యే 'తంబిగాడు' ఇవాళ పదిగంట లైనా రాలేదు. అధికారి వూరికే తనముందు పరుచుకున్న నేలనీ, దానిమీద వొరిగినఆకాశాన్నీ చూస్తూకూర్చున్నాడు. దేన్ని చూడడం? అర్థంపర్థంలేని కొండలు బయళ్ళు వూరికే మేఘాలని పోగుచేసుకుని, వొక్కవర్షంచుక్కైనా కురుచ్చిపెట్ట లేని పీనాసి ఆకాశం-డాక్టర్లు, నవ్వులు చంపుకుతింటే ఇక్కడి కొచ్చాడు... ఆరోగ్యానికి, అందానికీని. తనకి ఆరోగ్యం, భార్యకి అందం.

అరవైయేళ్లు దాటింతర్వాత, ఆరోగ్యంసంగతిజ్ఞాపకం వొస్తుంది. ఈ డాక్టర్లకి; ఏభైయేళ్ళు దాటినా, తన భార్యకి తన అందంతో తప్ప, ప్రకృతి అందంతో ప్రమేయంలేదు. మేడమెట్లు దిగి కిందికి రాదుగా! తను పైకి ఎక్కలేడు!

'మా ఆవిడకి అందంతో నిమిత్తంలేక మెట్లు దిగదు; ఆరోగ్యంలేక నేను మెట్లెక్కలేను. ఇల్లాంటిచోటికి పంపించా

రయ్యా!' అని సలహాయిచ్చిన డాక్టర్లకి వుత్తరం వ్రాద్దా
మని సంకల్పించుకున్నాడు అధికారి. కానైతే కాగితాలేవీ
కలమేదీ? అవి దొరికేటప్పటికి వ్రాద్దామనుకున్నది కాస్తా
మర్చిపోతాడు. అంక్కడికీ తను మెట్లున్న కొంపలొద్దు మనకి,
ఎక్కాదిగా చెయ్యలేం, ముసిలాళ్ళం-అని భార్యతో ఎంత
చెప్పినా ఆవిడ వింటేగా? తనకి మేడే కావాలంది. మేడలేక
పోతే దర్జాకి లోపమనేమో! ఏదో రెండురోజు ఓపికపడితే,
పెద్దమ్మాయి 'కళ్యాణి' పూనానుంచి సెలవులకొస్తుంది, తన
కష్టాలన్నీ తీరతాయి- అనుకొని, అధికారి తమాయించు
కున్నాడు. తనపేరుకి తనకే నవ్వొచ్చింది. అధికారిట! కాలేజీ
ప్రొఫెసరుగా ఆరేళ్ళు అమాయకులైన విద్యార్థులమీద అధి
కారం ఛలాయించాడు పత్రికా సంపాదకుడుగా ప్రూఫ్‌రీడర్ల
మీద పదేళ్ళు ఛలాయించాడు. దివాన్‌గా ఎనిమిదేళ్ళు
అడ్డమైనవాళ్ళమీద ఛలాయించాడు. ఇక్కడ,యిప్పుడెవరి
మీద ఛలాయించడం! కొండలు;వర్షం కురవడమేనాచేతకాని
దద్దమ్మ మేఘాలు: గడ్డిమొలిస్తే ఎవరేనా కోస్తారని
రాళ్ళగుట్టల్నికన్న బయళ్లు - వీటిమీద ఛలాయించాలి.
ప్రొద్దున్న తను షికారుకెళ్ళినప్పుడు, ఓ ముసలి దౌర్భా
గ్యుడు దారిలో కలుసుకుని, ఆ కొండల్ని, బయళ్ళనీ,
మేఘాలనీ మెచ్చుకోడం మొదలెట్టాడు! బాగా వాదించి,కసి
తీరా తర్కించి అంతాతప్పని ఋజువుచేసి, ఆ దౌర్భాగ్యుణ్ణి
తన భార్యముందు వోడిస్తేకాని, తనకు శాంతి సమకూరేటట్టు
లేదు. ప్రతిరోజూ పత్రికల్లో దేశంలో శాంతి, అంతర్జాతీయ
రంగంలో శాంతి అని అఘోరిస్తాడేకాని, తనహృదయంలో

శాంతిని గురించి చెప్పేదేం! సంపాదకునికి లేఖ వ్రాయాలి. 'అయ్యా, ఆరోగ్యంకోసం కొండల్లో కెళ్ళమనే డాక్టర్లనీ, అందంకోసం ఏకాంతంలో కెళ్ళమనే కవులనీ, ప్రభుత్వంవారు బంధించి, జైళ్ళల్లో వుంచటం అవసరంగా తోస్తోంది—ఏం లాభం! కాగితం, కలం లేవుగా! ఇందాకా ఏదో యిట్లాంటి ఉత్తరం వొకటి రాద్దామనుకున్నాడు. అదేమిటో వొక్కటీ జ్ఞాపకంరాదు. అధికారికి తీవ్రంగా కోపం వొచ్చేసింది.

చప్పట్లుకొట్టి భార్యను కేకేశాడు.

ఆవిడ మెట్లపైన నుంచుంది.

'కిందికి దిగు,' అని గర్జించాడు అధికారి.

'ఏం, ఎందుకు?'

'నా కనేకం కావాలి'

'మీరే రండి పైకి' అంది నవ్వుతూ.

'నే నొచ్చేప్పటికి, అవన్నీ మర్చిపోతాను; యీ మెట్ల కొంప వొద్దంటే విన్నావుకా—'

'ఎందుకంత రుసరుస? తల్చుకుంటే మీ రెక్కగలరు మెట్లు' అంది మళ్ళా నవ్వుతూ. ఆ నవ్వుతో అధికారి కోపం తగ్గింది. ఆ నవ్వులో ఏముందో మజా! ఆయన కళ్ళకి ఆవిడ కొండమీద ప్రతిష్ఠించిన అమ్మవారివిగ్రహంలా వుంది.

'అంతేకాని నువ్వు దిగవన్న మాట?'

'మెట్లెక్కడం, దిగడం వొంటికి మంచిదని డాక్టరన్లేదు?...'

'అంటా డంటాను! వాణ్ణి మెట్లపైనుంచి, కిందికి దొర్లించి, కిందినుంచి పైకిలాగి, మళ్ళా కిందికి దొర్లిస్తే'...

దేశంలో అన్నం కరువైనా తగ్గుతుంది. డాక్టరు, నూట తొంభై పౌన్లు.'

ఇంతట్లో 'తంబి' వొచ్చాడు. వాడిచేత గ్లాసుతోపాలు, పొగాకుడబ్బా కిందికి పంపించింది.

అధికారి పాలు త్రాగి చుట్ట కాలుస్తూ, పత్రిక చదవడం సంగతి మరిచిపొయ్యాడు. ఆయన ఆలోచనలు 'దౌర్భాగ్యుడి వేపుకి వెళ్ళసాగాయి. తను షికారుకి వెడుతుంటే, అతను రాయిమీద పడుకుని పాడుకుంటూ కనపడ్డాడు: కనపడగానే అతను ముదుసలి; ఎంతొచ్చి అతని నెరిసిన తలవెంట్రుకలు పూడలేదు. నిర్మానుష్యమైన ఆ ప్రదేశంలో దేవతలా ప్రత్యక్షమయ్యాడు. ఇద్దరూ అరగంటసేపు కబుర్లు చెప్పుకున్నారు; సంభాషణ, మొదట్లో గాడిదల్ని గురించి ప్రారంభమైంది... ఎందుకో దూరంగా బీళ్ళల్లో వారికో గాడిద కనుపించింది. ఆ ముసలాయన ఆకొండల్ని, బయళ్ళని మెచ్చుకోటం మొదలెట్టాడు. తనకి వొళ్ళు మండిపోయింది వాదించుకున్నారు యిద్దరూ. 'ఇంతటితో వాదం పూర్తి కాలేదు. యింటికి రా' అని ఆహ్వానించాడు. తను వొచ్చేస్తూ, నీ పేరేమిటనడిగితే 'దౌర్భాగ్యుడు' అన్నాడు. నిజంగా అన్నాడా, తన వూహా? అధికారి కళ్ళు నిరసంగా మూతలుబడ్డాయి. గాలికి కొట్టుకుని కొట్టుకుని అలిసి వేలాడిపోయిన వొంటిఆకులా అతని మెడ భుజంమీద నిశ్చితంగా వాలిపోయింది.

ఎంతసేపయిందో —

ఎవరో అతన్ని లేపారు—తంబిగాడు.

వాడి భుజంమీద చేతులు ఆనించి అధికారి మెట్లెక్కడం సాగించాడు. మెట్లపైన ఏదో మనిషి ఆకృతి ... మరీ మరీ పెద్దదవుతోంది ... నాలుగు, ఐదు, ఆరు ... ఎవరిది ఆ ఆకృతి ... ఏడు ఎనిమిది ... తన భార్య అరుణ! ... తొమ్మిది ... తెల్ల మబ్బుల్ని కప్పుకున్న పచ్చకొండలా ఆకారం, నురుగల్ని పెనవేసుకున్న కెరటంలా ఆ తెల్లటి జుట్టు; చీకట్లో చలించని నీటిలో మసలిన చంద్రబింబాల జంటలా ఆ కళ్ళజోడు — పన్నెండు, పదమూడు — మెట్లెక్కడం ఎంత సులభం! — పదిహేను - పదహారు - మెట్ల భవనాలపై తిరిగి, మౌనంలో ముడుచుకున్న ఆమె పెదవులు, సముద్రంలో కలిసిపొయ్యే సంధ్యాసమయ మేఘాలలో తన దృష్టిని ఆపేస్తోంది- పందొమ్మిది--అని నవ్వా! పై పళ్ళు రెండు వూడిపొయ్యాయి. పాపం బంగారంపళ్ళు వేయిస్తానంటే వొద్దంది.. పెదవుల్తో నవ్వడం మానేసి- అరుణకే తెలుసు... ఇరవై, అమ్మయ్య-ఇరవై వొకటి చేతులతో అందుకుంది - అధికారి అరుణలో ఐక్యం అయి పొయ్యాడు.

* * *

ఆ రోజున ఎవ్వరూ మళ్ళా మేడమెట్లు దిగలేదు. 'దౌర్భాగ్యుడు' రాలేదు.

* * *

మొన్నాడు తెల్లారి, ఎనిమిదింటికి, అధికారికి అమాంతంగా 'దౌర్భాగ్యుడి సంగతి జ్ఞాపకంవొచ్చింది. వెళ్ళి వెదికి తీసుకురావాలని బైలుదేరాడు. పైగా డాక్టర్లు రోజూ ఉదయం ఒక మైలైనా నడవాలన్నారు ... డాక్టర్లజోలి తన కెందుకు?

ఈ కొసరుత్తు స్త్రీలకి చెప్పరేమో డాక్టర్లు; ఎవళ్ళు ఏది చెయ్య గలిగితే దాన్నె పరపూయిస్తారు కాబోలు. ఇంతమందిడాక్ట ర్లుండీగూడా. యీ దేశంలో జనాభా పెరిగిపోవడం నిజంగా ఆశ్చర్యమే!

'నువ్వు నన్ను దింపనక్కర్లేదు. నేనే దిగుతాను'— అంటూ అరుణ చేతిని తొలగించేసి, వొంటిగా మెట్లుదిగడం మొదలెట్టాడు అధికారి. ఒక మెట్టు దిగేసరికి, మెట్లగది గుమ్మంలో దౌర్భాగ్యుడిమొహం కనిపించింది. దౌర్భాగ్యుడు రాతిబొమ్మలా స్తంభించి మెట్లకేసి చూస్తున్నాడు.

'అదేమిటి మాటా మంతీ ఆడవేం... నేను దిగలే నా...?' అధికారి ఆఖరిమెట్టుమీద అడుగుపెట్టగానే, అరుణ లోపలి కెళ్ళిపోయింది.

'అదేమిటి, తెల్లబోయి చూస్తావు. ఎప్పుడూ మేడ మెట్లు చూళ్ళేదా!' ఆయాసంతో అధికారి చివరి మెట్టుమీద కూర్చుండిపోయాడు. దౌర్భాగ్యుడుకూడా ఆయనప్రక్కనే కూర్చున్నాడు.

'ఇదిగో చూడు...'

'చూస్తున్నా, వింటున్నా...'

'నీతో ఏదో చెప్పాలనుకున్నా...నీ కేమన్నా జ్ఞాపకం వుందా?'

'ఓ, మీరు గట్టిగా మాట్లాడనక్కర్లేదు. నాకు చెముడు లేదు.'

'ఆవిషయంగాదు. ఆఁ జ్ఞాపకంవొచ్చింది-యీకోటు విప్పాలి. మనం యింక బైటకి వెళ్ళంగా'

అని. కాసేపు కోటువిప్పి కార్యక్రమం జరిపాడు అధికారి.

'ఇప్పుడు చెప్పు నేనేం మరిచిపోయ్యానో.'

'కొందరు...' అని నవ్వాడు దౌర్భాగ్యుడు. సక్రమంగావున్న పళ్ళనరసని బైటపెడుతూ.

'నువ్వసాధ్యుడవే — నేనంటాను... యిప్పుడు మరిచిపోయ్యాను. కాసేపుండి చెబుతాలే—అన్నట్టు నువ్వేమనా టిఫిను ఫలహారం చేస్తావా, చేశావా...?'

'చేశాను; ఐనా అభ్యంతరంలేదు.'

'ఇదుగో, అరుణా — ఆ, నీ పేరేమిటి?'

'చెప్పాగా—దౌర్భాగ్యుడు.'

'భలే సరసమే-మా యిల్లాలితో యీ దౌర్భాగ్యుడికి ఫలహారం పట్రావే అనమంటావా- ఇదిగో, అరుణా! ఫలహారం తీసుకురా...'

అరుణ మెట్లమీద నుంచుంది. ఆవిడచుట్టూ, హాసీ, గంతులేస్తోంది. మెట్లమీదనుంచి గబగబా దిగి - వారిద్దరి మధ్యకి వొచ్చింది. ఇంతలో 'తంబి' వొచ్చాడు. పైకిరమ్మని సంజ్ఞచేసింది అరుణ 'తంబి' అధికారిని లేవదీసి వరండాలోకి తీసికెళ్ళి, కుర్చీలో జేర్లవేశాడు. మరో పడకకుర్చీలో దౌర్భాగ్యుడు కూర్చున్నాడు 'తంబి' ఫలహారం తీసుకొచ్చాడు... రొట్టె, వెన్న, పంచదార, రెండు కమలాఫలాలు, కాఫీ.

'నిన్నకూడా నాలా, యీ వూరు డాక్టర్లు పంపలేదు గదా?' అని అడిగాడు అధికారి.

'లేదు. అంతే సాధారణంగా డాక్టర్లకి నచ్చుతున్న వూరువాదిలి వెళ్ళే అవకాశం వుండదు. అంచేత యితరుల్ని మరోచోటికి పంపేనా తృప్తిపడతారు-' ఈవిషయం అధికారికి నచ్చినట్లుంది: బహు సంతోషంలో 'వూ' కొడుతూ కుర్చీ కొంచెం ముందుకి జరుపుకున్నాడు.

'నేను దివానుగా ఉంటున్న రోజుల్లో వోమారు, తాశీల్దారుకి జబ్బుచేస్తే, మదనపల్లి పంపించారు డాక్టర్లు; ఆయన వొచ్చాక, ఆయనభార్యకి జబ్బుచేసింది; ఆవిణ్ణే పంపించాను,-తరువాత ఆయన్ని; మళ్ళా తరువాత ఆవిణ్ణే. భార్యాభర్తల వియోగంవల్ల అన్ని జబ్బులూ కుదురుతాయేమో!-' అని అధికారి నవ్వడం సాగించాడు.

కాసేపు నిదానించి మాట అందుకున్నాడు.

'నువ్వు నవ్వవేం? నీకు పెండ్లాం పిల్లలూ వున్నారా? యింతకీ తాశిల్దారు పెళ్ళాన్నిచూడ్డం తటస్థించింది; ఏజబ్బూ లేదు; దుక్కలాగుంది—'మళ్ళా నవ్వుతున్నాడు.

'అంటే ఆడాళ్ళజబ్బులు పైకి కనబడవుగా మరి— అన్నాడు దార్శనికుడు.

'లోపల రోగం అంటావు - మీ ఆవిడ కేం జబ్బు?'

'నాకు భార్య లేదు;'

'పోయిందా పాపం?'

'అసలు పెళ్ళి కాలేదు.'

'పిల్లలు?-మరే మరే—అసలు పెళ్ళేకాలేదన్నావుగా. పెళ్ళికానంత మాత్రాన పిల్లలుండగూడదని లేదనుకో—' అధికారి. తనలో తనే నవ్వుకొంటున్నాడు.

'ఇదిగో, నిన్ను 'దౌర్భాగ్యుడు' అని పిలవడం ఏమీ బాగాలేదు. నీ పేరేమిటో చెప్పు, చంపక.'

'నాకే పేరుంటే బాగుంటుందో, ఆ పేరే పెట్టి పిలవండి'

'ఐతే ఆలోచించనీ—నువ్వు కొండల్ని మహా మెచ్చుకొంటున్నావు గనుక, 'కొండయ్య' అని పిలుస్తాను... లేకపోతేను,' అని అధికారి వెటకారంగా కోపం ప్రకటించాడు.

'అల్లాగే పిలవండి - నాకు కొండలంటే నిజంగా ఇష్టం. వాటిల్లో స్థిరత్వంవుంది. అవి కదలవు, మారిపోవు; మనుష్యులు మోసగిస్తారు. మోసపోతారు। మారిపోతారు; అసువుబోతారు; కొండలు మాత్రం అల్లాగే వుండిపోతాయి...' అన్నాడు కొండయ్య.

'అది బాగానే వుందయ్యా, అయితే... మేఘాన్నీ, నదులనీ మెచ్చుకొంటావెందుకు?'

'అవన్నీ ఆ కొండల్ని పట్టుకుని వేళ్ళాడతాయిగనక'

'కొంపతీసి నువ్వు కవివా ఏమిటి చెప్పు...'

'ఇంకోళ్ళకొంపలు తీసేవాడు సంస్కర్త, తనకొంప తీసుకునేవాడు కవి' అన్నాడు 'కొండయ్య' గూఢంగా.

'నీ కసలు కొంపే లేదుగా-' అని వికృతంగా నవ్వాడు అధికారి. మళ్ళా యేదో జ్ఞప్తికివొచ్చి-

'నీకు ఆ తాశీల్దారు భార్యఫోటో పంపించాలి' అని చప్పట్లుకొట్టి 'తంబిని' కేకేసి, అమ్మగార్నడిగి సంస్థానం ఫోటోల ఆల్బమ్ తీసుకురమ్మన్నాడు.

'తంబి' ఆల్బమ్ తీసుకొచ్చాడు.

'ఆ, యిదిగో ఆల్బమ్ - యీవిడా, తాశీల్దారుగారి సతీమణి. రెండో పెళ్ళి పెళ్ళామనుకో-చూసుకో ఎంత మజాగా వుందో. అరుంధతి, శకుంతల, తిలోత్తమ, 'జ్యూలియెట్' అబ్బో-యీవిడికి చాలా పేర్లుండేవి. ఈవిణ్ని చూసినవాళ్ళు నిద్రాదేవికి విడాకులిచ్చారంటే నమ్ము ఒకవేళ నిద్రాదేవిని వదలకపోతే, కాసేపు స్వప్నకాంతతో గడిపేవారు—' జ్ఞాపకాల సౌందర్యంతో అధికారి కళ్ళు మెరుస్తున్నాయి.

'...ఆవిడకి కొంచెం ముందుగా కుర్చీలో యీవ్యక్తి ఎవరు చెప్పుకో-పాగావుంది, గుర్తుపట్టవులే! ...పేసే - యిప్పుడంటే జుట్టంతా వూడిపోయిందిగాని...ఆవ్యక్తి యీవ్యక్తికోసం పరితపించిందంటే ఆశ్చర్యపడతావా?' జ్ఞాపకాలశక్తితో అధికారి కాలప్రవాహంలో ఎదురీత సాగించాడు.

'ఆ, నే నాశ్చర్యపడతాను' అన్నాడు కొండయ్య.

అధికారి నిర్ఘాంతపోయాడు. ప్రశ్నార్థకంగా కనుబొమ్మలు చిట్లించాడు.

'స్త్రీలు పరితపించరు; యితరులకి పరితాపం కలిగిస్తారు. అట్లా పరితపించిన వ్యక్తులలో తమరొకరు కావచ్చు.'

అధికారికి చాలా కోపం వొచ్చింది.

'మంచివాడివే-ఆరోజుల్లో నన్ను నువ్వు చూళ్ళేదు మరి. అప్పటిశక్తి, అందం, దర్జా; యిప్పటిఅనుభవం, జ్ఞానం-యీ రెండు కలిస్తేనా -' అని అవి కలిస్తే యెట్లావుంటుందో వూహించుకుంటూ నిశ్శబ్దంలో పడ్డాడు అధికారి.

'ఈ రెండూ కలిసినవాళ్ళకి స్త్రీ అక్కరలేదు; కలవని వాళ్ళు స్త్రీలకి అక్కర్లేదు.'

'నీకేం తెలీదు - నీకు పెళ్ళా, పిడాకులా - ఆడదాని మొహం యెరుగుంటేగా!'

'మొహం నే యెరుగను, కాని మనస్సు ఎరుగుదును.'

'ఏంకథ-ఒకప్పుడు గంద్రగోళం చేసినవాడి వైఖరే నీది-వారే, 'తంబీ' అమ్మగారేంచేస్తున్నారు!'

'కుట్టుకుంటున్నారండి.'

'నువ్వు వూళ్ళో కెళ్ళి చుట్టలట్రా-'

తంబి వెళ్ళాడు. అధికారి తన కుర్చీ యింకా దగ్గరగా లాక్కుని, కాళ్ళు స్తంభానికి ఆనించాడు.

నడిచిపోతున్న 'తంబి' కేసి చూస్తూ, కొండయ్య ప్రారంభించాడు.

'నేను వాడంతవుండేవాణ్ణి. మా యింటిపక్కనే రెండు పెద్దమేడలుండేవి. మొదటిది పాతమేడ అందులో ఎవ్వరూ కాపురం వుండేవారు కాదు-కాని సత్రవులోలాగా జనంవొస్తూ పోతూ వుండేవారు. దాని పక్కమేడలో ధనంగారి వాళ్ళుండేవారు; ఆ రెండమేడలూ వాళ్ళవే. చాలా స్థితిపరులు. ఒకరోజున నేనూ మా అత్తయ్య గుళ్ళో కెళ్ళాం; అక్కడ చూశాను ధనాన్నీ, వాళ్ళమ్మనీ. ధనం పదేళ్ళపిల్ల; నేనో రెండేళ్ళు పెద్ద గుడిలోపల దేవుడిదగ్గర అంతాచీకటే! ఆమదం బుడ్ల వెల్తురులో ధనం మహాలక్ష్మిలా మెరిసిపోయింది. అటు కేసిచూస్తూ నమస్కారాలు పెట్టి, అత్తయ్యని చూసి చెంప లేసుకున్నాను. తరువాత బోలెడుమంది జనంవొచ్చి మమ్మల్ని నెట్టేశారు. అత్తయ్యా నేను విడిపోయ్యాం. ధనం, వాళ్ళమ్మా అర్చనలేవో చేయిస్తున్నంతసేపూ నేనక్కడే వుండిపోయ్యాను'

వాళ్ళతో బాటే వాళ్ళ వెనకాలే నేను నడచివెళుతున్నాను. మా యింటివేపు కేసి నడుస్తున్నాం. రోడ్డుకి రెండు వేపులా పెద్ద పెద్ద చెట్లకొమ్మలు వ్రేళ్ళాడుతున్నాయి సంతబండి గూడు. కొమ్మలకితగిలిసన్న కొమ్మలు ఘనం నెత్తినిదూసుకున్నాయి. ఘనం తల్లోపూలు కిందపడిపోయాయి. వాటికోసం వొంగుని తీసుకోబోయింది; వాళ్ళమ్మ కూకలేసి, చరిచింది ఆ పూలని వొదిలేసి, వాళ్ళమ్మతో నడిచిపోతోంది. ఆ పూలని నేను తీసుకున్నాను గుళ్ళో తీర్థంతో యింకా తడిగానే వున్నాయి ఆ పూలు వాటిపక్కనే ధగ దగా మెరిసిపొయ్యే చిన్న వజ్రపుటుంగరం అక్కడ పడిపోయింది. దాన్నితీసుకున్నాను. వాళ్ళు వాళ్ళింటి కెళ్ళిపొయ్యారు నాకేమీ తోచకపువ్వుల రేకలు నోట్లో చప్పరిస్తూ, ఖాళీమేడమెట్లమీద కూర్చుండి పొయ్యాను. ఖాళీ మేడకి ముందు అరుగుమీదనుంచి మెట్లు దొడ్లోంచి మరోరకం మెట్లూ వుండేవి. దొడ్డివేపు మెట్ల మీద కూర్చున్నాను. ఒక గంట జరిగింతర్వాత ఘనం రోడ్డంట యేదో వెతుక్కుంటూ మా యింటికేసి వొస్తోంది. నాకు తెలుసు వుంగరంకోసం అని. దగ్గరగా వెళ్ళాను.

'పూలు పారేసుకున్నావు' అన్నాను, పువ్వులు చూపుతూ.

'కాదు, కాదు.'

'మరేమిటి వెదుకుతున్నావు?'

'ఏమీ లేదు.'

నాకేసి చూడకుండా అల్లా నడిచిపోతోంది.

'చెప్పు, నేనూ వెదుకుతాను' అన్నాను.

'అమ్మ కొడతేస్తుంది.'

అని బిక్కమొహంపెట్టి, మెట్లమీద కూర్చుంది. అప్పట్నించి నాకా ఉంగరం యివ్వాలనిపించలేదు. ఏడుస్తూంటే జాలేసింది కాని మెట్టుముందు బోలెడు యిసకుంది. అందులో కూర్చుని దూదుంపుల్ల ఆడడం మొదలెట్టి, ఆటకి రమ్మని పిలిచాను. రానంది. నేనొక్కణ్ణే ఆడుకోడం మొదలెట్టాను. కొంతసేపయింతర్వాత, వొక చేతులో పువ్వులుంచుకొని, రెండో చేతిలో ఉంగరం వుంచి ధనాన్ని కళ్ళుమూసుకోమన్నాను. మూసుకుంది. తెరవమన్నాను; తెరిచింది.

ఈ రెండింటిలో యేది బావుంది?' అని అడిగాను. ఉంగరంచూసి కొండంత మొహంచేసుకుంది.

అధికారి కుర్చీలో కదిలి, 'అందుకా కొండలంతే సి కిష్టం?' అన్నాడు.

'తే, నా వుంగరం' అని లాక్కో బోయింది. నేను గుప్పెడి మడిచేశాను.

'ఏది బాగుందో చెబితేకాని యివ్వను' అన్నాను.

ధనం నా ప్రశ్నకి సమాధానం చెప్పకుండా వొచ్చి, నా గుప్పిడి పట్టుకుని చేతిని బకికి వేళ్ళని పీకుతోంది. నేను గుప్పిడి విప్పలేదు. 'యియ్యి యియ్యి' అని చేతిని కరిచింది. నేను వుంగరాన్ని రెండో గుప్పిట్లోకి ఫిరాయించాను.

'అమ్మతో చెబుతాను, చూసో' అంది.

నేను మెట్లెక్కి పైకి పరుగెత్తాను; తనూ పరుగెత్తింది. అల్లా అరగంటసేపు, మెట్లమీద పరుగెత్తాం. చివరికి ధనం అలిసిపోయి మెట్లమీద కూర్చుండిపోయింది. నేను మెట్లకింద

దూమువిల్ల ఆట అభినయించి వుంగరాన్ని యిసుకలో దాచేసి, మాయంచేశానని చెప్పాను. ఘనం మెట్లుదిగలేదు. కిందకి రమ్మన్నాను! దిగనంది. దిగితే వుంగరంయిస్తానన్నాను. అక్కర్లేదు పో, అంది నేను వుంగరం తీసుకు వెళ్ళి పొయ్యాను.

ఇట్లా లాభంలేదు మంచిచేసుకుంటే కాని వుంగరం దొరకదనుకుందో యేమో రోజూ ఏదోవొంకని మా ఇంటికి రావడం, మేం యిద్దరం మేడమెట్లమీద ఆడుకోడం, కొన్ని వారాలు జరిగింది. ఏమండోయ్, మీరు వింటున్నట్లులేదు.'

అధికారి కళ్ళు మూతలు పడుతున్నాయి. చిత్రమైన కలలోంచి లేచినట్లు తటాలున లేచి, కళ్ళు నులుపుకొని తెల్లబోయి చూశాడు.

'అవునవును—బాగుంది; తరవాత ఏం జరిగింది?'

'మీరు వినడంలేదు నేను చెప్పను.'

'చెప్పకేం చేస్తావ్, మహాచక్కగా చెప్తావు. ప్రేమ గాథ మొదలెట్టినవాడు ఆగడం నే ఎరగను.'

'ఇది ప్రేమగాథ కాదు. ఒక్క పురుషుడు మాత్రమే ప్రేమిస్తే స్వీయచరిత్ర; అవతల స్త్రీకూడా ప్రేమించినప్పుడే ప్రేమగాథవుతుంది' అన్నాడు కొండయ్య.

'ఓయి పిచ్చివాడా! ఏ స్త్రీకూడా, 'నిన్ను ప్రేమించా' ననదు. అంటే మొగాడికి లోకువవుతుంది. మా తాశీల్దారు భార్యవిషయం తీసుకో-తన్ను ప్రేమించి చేసుకుందని మురిసి పోయ్యేవాడు, అమాయకుడు—' అంటూ అధికారి నవ్వడం సాగించాడు.

తంబి' చుట్టలు తీసుకొచ్చాడు. అధికారి చుట్టముట్టించాడు.

'ఏదీ యిహ చెప్పు ఎంత విసుగ్గావున్నా తట్టుకోగల్ను'.

'అయితే నే చెప్పను' అన్నాడు కొండయ్య.

'నువ్వు చెప్పకపోతే ప్రసూదం పేను. నే చెబుతా విను- నా చిన్నప్పుడు,-అబ్బో! బాగా చిన్నప్పుడు, నలభై యేళ్ళనాటి సంగతి...' అని అధికారి వొక కల్పితగాధ మొదలెట్టాడు. ఆగాధకి అంతమయ్యే ప్రాప్తంలేదు. అధికారి భార్య భోజనానికి పిలిచింది. ఆయన మేడమెట్లు ఎక్కలేను, క్రిందకు పంపించమన్నాడు. మెట్లగదిలో 'తంబి' పీటలు, కంచాలు పెట్టాడు. ఇద్దరూ అన్నం వొడ్డించుకు తిన్నారు. నిద్రపోయి మధ్యాహ్నం మూడింటికి లేచాడు, అధికారి.

'కొండయ్యా వున్నావా? వెళ్ళిపొయ్యావనుకున్నా! నాకు యిందాక వొక సందేహం వొచ్చింది. మళ్ళా మరిచి పోయ్యాను.

'జ్ఞాపకం తెచ్చుకోండి.'

'ఐతే నువ్విక్కడి కెందుకొచ్చావ్!'

'మీరు రమ్మంటే.'

అది కాదయ్యా,—ఈవూరు!'

ఇక్కడికి నాలుగుమైళ్ళ దూరంలో పండ్లు, పువ్వులు ఎగ్జిబిషన్ పెట్టారు మంచి విత్తనాలు పట్టుకుపోదామని. నాకో ఆరెకరాల భూముండేది. ఎరక్కపోయి, అందులో పునాగు వేశాను. దెబ్బతిన్నాను. మళ్ళా అందులో వొకతోట వెయ్యాలని.'

‘అరవై యేళ్ళొచ్చాక చదువుకోక మనుష్యగొట్టుకున్నాట్ట! నువ్విప్పుడేస్తే తయారయ్యేటప్పటికి నాలుగేళ్ళైనా పట్టదూ! ఎవరికోసమనీ, ఎందుకోసమనీ?’ అన్నాడు అధికారి

‘ఆ తోటలో వొక ఆశ్రమం నిర్మిస్తాను. నాలాంటి బీద వృద్ధ బ్రహ్మచార్లకి అది నిలయంగా వుండేటట్లు విల్లు రాస్తాను’

‘అంటే!—ఓహో, నీ ప్రేమగాథ వింటే కాని తెలవదనుకుంటా. ఏదీ చెప్పు – ‘తంబీ!’ ‘టీ !’

‘తంబి’ ట్రేలో రెండుకప్పుల టీ, రొట్టి, వెన్న తీసుకొచ్చాడు. అధికారి రొట్టి పాలల్లో ముంచుకుని చప్పరించి తిన్నాడు ఫలహారం అయింతర్వాత, యిద్దరూ మళ్ళా కొండలకేసి షికారుగా నడుస్తున్నారు. సాయంత్రం ఐదు దాటింది. నిశ్చింతగా పడుకొన్న స్త్రీ రొమ్ములమీద ఆకు పచ్చచీర మడత కొంగులా, రెండుకొండలూ మెదలకుండా వున్నాయి. కాలిబాటలు, రొమ్ములమధ్య నలిగిన చీర మడతలు – నిద్రలో ఏడ్చిఏడ్చి ఎఱ్ఱబడి, తెరిచిన వొంటి కన్నులా సూర్యుడు కొంత వెనక్కిదిగి కన్ను నులుముకుంటున్నాడు; చోద్యంచూస్తూ మేఘాలు చుట్టూ చేరుకున్నాయి; ఏదో జ్ఞాపకంవచ్చినట్లు, ఎక్కడో పిట్టకూసింది; సర్వమూ త్యజించిన రాళ్ళుకూడా సంధ్యవేసిన యింద్రజాలంలో యిరుక్కున్నాయి.

కొండయ్య రాతిప్రక్క లేతగడ్డిలో పడుకున్నాడు. అధికారి రాతిమీద కూర్చున్నాడు.

'కొండలు ఆకాశంలోకి దేవుడు వేసిన మెట్లు' అన్నాడు కొండయ్య.

'గాడిదిగుడ్డు' అన్నాడు అధికారి

'మెట్ల చివర వుంటాడు. దేవుడు కిందికి రాడు మనిషి పైకి రమ్మంటాడు. మనం వెళ్ళం. వీళ్ళజోలి మనకెందుకని దేవుడు ఆ మెట్లు పడగొట్టేశాడు పడిపోగా మిగిలినవి కొండలు'

'వెళ్ళవయ్యా, మహా చెప్పొచ్చావ్ - మెట్టవేదాంతం. నీకు మనుష్యులతో సంపర్కం లేక, కొండలతో తృప్తిపడు తున్నావు. ఎవళ్ళూ స్నేహితులు లేనివా డేం జేస్తాడు మరి!' అన్నాడు అధికారి.

'మీరు నా స్నేహితులు కారు?' అన్నాడు కొండయ్య సూర్యుడు పొడవకుండా కళ్ళమీద చెయ్యి అడ్డుపెట్టుకుంటూ.

'పెళ్ళి కాని వారికి స్నేహితులుండరు, పిచ్చివాడా!' పెళ్ళాందగ్గరనుంచి పారిపోయేటందుకు స్నేహితులు బాగా పనికొస్తారు. నీ కట్లాంటి పెళ్ళాం లేదుగా. నువ్వు నాకు స్నేహితుడవు గాని, నేను నీకు కాదు' అని అధికారి నవ్వుతూ, కర్రతో నేలని పొడుస్తున్నాడు.

కొండయ్య మాట్లాడలేదు.

'కోపం వొచ్చిందా—లేదులే, పాపం—నేమేదీ చెప్పు—ధనం కద—అవుతే ఆ అమ్మాయి పేరు ధనమేనా?'

'కాదు, వేరే పేరుంది. వాళ్ళు ధనవంతులు కాబట్టి నేను 'ధనం' అని వ్యవహరించేవాణ్ణి. ఏడాదిగడిచింది. ధనం వుంగరం ప్రమేయం ఎత్తడం మానేసింది. మేం మేడమెట్ల మీద అనేకరకాల ఆటలు ఆడుకునేవాళ్ళం. పట్టుకునే బద్దల

మీదనుంచి జారడం, పైనుంచి కిందికి; వెనక్కి తిరిగి దిగడం, ఎవరు ముందెక్కుతారోనని పందాలేసుకుని పరుగులెత్తడం—ప్రొద్దున్న గంటా, సాయంత్రం రెండుగంటలు. మా స్నేహం ఎవ్వరికీ తెలీదు-మాకే తెలీదు.'

'మేడమెట్లమీద ఆడుకునే అవసరం ఎందుకొచ్చిందీ?' అని అడిగాడు అధికారి.

'మరెక్కడా వీల్లేదు. దొడ్లో ఆడుకుంటే వాళ్ళూవాళ్ళూ కనిపిస్తారు. వీధుల్లో ఆడితే మావాళ్ళు కనిపిస్తారు. కొన్ని రోజులు 'సరస్వతీ, భక్తుడు' ఆట ఆడేవాళ్ళం. నాకు చదువొచ్చేదికాదు. ఆమె సరస్వతిట. దొడ్లో కొమ్మలు తీసుకొచ్చి, మెట్లపైన చివరి మెట్టుమీద రవివర్మ బొమ్మలో సరస్వతిలా, కొమ్మని వీణకింద అమర్చుకుని, కళ్ళుమూసుకుని కూర్చునేది. నేను భక్తుడను, మెట్లకింద పువ్వులతో పూజించేవాణ్ణి.

'దేవీ! మీరు కనబడండి'

'భక్తా! నీవు పైకి రమ్ము.'

'అంతదూరం యీ దీనుడు రాలేడు.'

'నీ కర్మం! నేను కిందికి రాకూడదు' అనేది.

'భిక్షం పెట్టించండి' అనేవాణ్ని.

ధనంగారి వుంగరం యిచ్చినెయ్యి. తరవాత భిక్ష పెడతాను.'

'వుంగరం పోయింది,-దీనవాణ్ణి, క్షమించండి. మీరు భాగ్యవంతులు. మీరే యివ్వండి' అన్నాను.

దొడ్లో యెవరో పిలిచినట్లనిపించింది. సరస్వతి కొమ్మని నా నెత్తిమీద వొదిలేసి, గబగబా పారిపోయింది.

తరవాత ఐదారు నెలలవరకూ ధనం కనపడలేదు. వాళ్ళు వాళ్ళతో కలిసి ఏవూరెళ్ళిందో నాకు చెప్పలేదు. నేను ఒకణ్ణే ఆ మేడమెట్లమీద ఆడుకుంటూవుండేవాణ్ణి. ఇరవై మూడు మెట్లుండేవి; వాటిలో పద్ధెనిమిదింటికి పగుళ్ళుండేవి. కింద రెండింటిమీద ఏవో గడ్డిమొక్కలు కూడా మొలిచేవి; మా ఆటవల్ల అవి కాస్తా చచ్చిపోయ్యాయి.

ఒకరోజు సాయంకాలం ఆరుగంటలకి, మెట్లదగ్గర కొచ్చి కిందిమెట్టుమీద కూర్చున్నాను మూలగా చిన్న తెల్లపువ్వు మొక్కవొకటి ఎదిగివుంది. అల్లా పైకి చూశాను. ఆఖరిమెట్టు మీద ధనం కూర్చునివుంది. నేను భయపడి, మెట్టుమీదనుంచి కిందికి జారిపోయాను. ధనం ఎదిగిపోయింది; మారిపోయింది; నేను గుర్తుపట్టలేను. చీర రవికా వేసుకుంది.

'నే వున్నానని నీ కెట్లా తెలుసు!' అంది. కంఠంకూడా మారింది. కంచువరల నూతిలోంచి వొచ్చే ధ్వనిలాగుంది. నాకు సిగ్గేసింది.

ఏమీ మాట్లాడలేదు.

'నేను రోజూ యిక్కడికి వొస్తుంటాను.'

'ఎందుకు?'

'ఏమో!'

'నేను దొంగని కాదు, నీ వుంగరం నీ కిచ్చేస్తాలే.'

'అబ్బ, కోపమే!-ఒకే దొంగా, వుంగరం దొంగిలించి నందుకు రాణిగారు నిన్ను శిక్షిస్తున్నారు' అన్నది ధనం.

నేను మాట్లాడలేను. మరో రెండుమెట్లుదిగింది. నా జుట్టులోనికి చెయ్యిపోనిచ్చింది. నా వొళ్ళు కంపరంఎత్తింది; ముట్టుకుంటే ఏమవుతుందో అని బెంగ. మందారం మొగ్గలా చిన్నినోరు; గులాబీరేకల్లాంటి చెక్కిళ్ళు; నక్షత్రంచేపలాంటి కళ్ళు. నా కేడవాలనిపించింది. ఎన్నిగాజులజతలో లెక్కపెట్టలేను; గలగల్లాడాయి. ఏడో ఎనిమిదో వుంగరాలు. ధగధగ మెరుస్తున్నాయి. తెల్లనిప్పులా దుద్దులు. నుదుటిలోనుంచి వుద్భవించినట్టుగా ఎర్రటిబొట్టు. రంగులసువాసన నావూపిరిన్ని బంధించింది. పల్చటి పసుప్పచ్చ పట్టుచీర—ఏది వొళ్లో ఏది చీరో తెలీక మతిపోయి మౌనంలోపడ్డాను నేను చూడలేకపోయాను. నా కళ్లిందుకో తడిసినాయి. అక్కడుండలేక వెళ్ళిపొయ్యాను—' కొండయ్య కళ్ళు మూసుకున్నాడు.

'నువ్వు పిచ్చివాడవు కొండయ్యా! ఆడదాని దగ్గర నాజూకు కవిత్వం, ఏడ్పులు పనికిరావు వాళ్ళు కాఠిన్యానికి దాసులవుతారు. ఓసారి, తాశిల్దారుగారి భార్య ఏంచేసిందంటే... వుండు, యిప్పుడు మర్చిపొయ్యాను. రాత్రి జ్ఞాపకం చెయ్యి. జ్ఞాపకంచేసుకుని చెబుతాను' అన్నాడు అధికారి.

మళ్ళీ కొండయ్య స్వగతంలా మొదలెట్టాడు.

'నేను అదిజరిగింతర్వాత, చాలారోజులవరకూ ఆ మేడకేసి చూళ్లేకపొయ్యాను. ఆ మేడమెట్లు ఎల్లాగో వున్నాయి; నా కోర్కెలు, కలలు, ఆదర్శాలు, అన్నీ ఆమెట్లకింద మారిపోయినట్లనిపించింది. నేనా మెట్లు ఎక్కలేను; రోజులు, వారాలు, నెలలు గడిచాయి.'

'ఓరి పిచ్చికొండయ్యా-అన్నింటిలోకీ అశాశ్వతమైంది ఆడదాని అందం. అదిపోయి బెదిరిపోయినవాడవు నువ్వెందుకు పనికొస్తావు? మా ఆవిడకూడా చిన్నప్పుడు చాలా అందంగా వుండేది. నాటకానికెడితే, ఆవిణ్ణిచూస్తూ, గేట్లోవాళ్ళు టిక్కెట్లు అడిగేవాళ్ళుకాదు. ఎందుకంటే? రైలు ప్రయాణంలో టికెట్ కలెక్టర్లు ఆవిణ్ణికాని, ఆవిడ పక్కనకూర్చున్న నన్నుకాని, టికెట్ అడగడం జరిగలేదు. నేను అందమైనవాణ్ణనన్న సంగతి నాకు తెలుసుగనక సరిపోయిందిగాని, మగాడైతే స్కూలుపిల్లల హేళన పడ్లేక విషంతాగి చచ్చును. అందుకనే పెద్దలు ఆలి మర్కటం కావాలని ఆశీర్వదించారు. చీకటిపడు తోంది. లే, వెడదాం-పురుగూపుట్రా వుంటుంది' అని అధికారి బండమీదనుంచి లేచి, చెయ్యి కొండయ్యకి ఊతంగా యిచ్చి లేవదీశాడు.

తూర్పుకొండ వెనక చందమామ వెలుగులో చీకటి తెలీడంలేదు. కొండలు నీడలుగా సాగారి వెన్నెల మత్తులో వెర్రిగా పడుకున్నాయి. కాలిబాటలు దూరంగా కలిసి పోయ్యాయి. మీా వెన్నెలుందిగా, మా జోలెవరిక్కావా లనుకుంటూ, మేఘాలన్నీ ఎక్కడికో కదిలిపోతున్నాయి.

'కాసేపుందాం' అన్నాడు కొండయ్య బండకి జేర్ల బడుతూ.

'చలిగాలి- ఎక్కువసేపు తిరిగితే, నా డాక్టర్లు చంపుతారు' అన్నాడు అధికారి; నవ్వుతూ మళ్లా అన్నాడు-'నా శ్రేయస్సుకోరేవాళ్లు డాక్టర్లు, లేకపోతే ఫీజు రాదుగా. లే, లే, నడుస్తూ చెప్పుకుందాం.'

అధికారి కొండయ్యారి లేవదీశాడు; ఇద్దరూ ఇంటివేపు నడవడం సాగించారు.

'చెప్పు, చెప్పు తిరనాలేం జరిగింది?'

'వారాలు గడిచాయి. ధనంవుంగరాన్ని, మా దొడ్లోంచి వెళ్లగించి, తిరిగి యిచ్చివేద్దామని నిశ్చయించుకొన్నాను. మేడదగ్గర కెళ్ళాను. జోలెడు జనం అటూయిటూ తిరుగుతున్నారు. దొడ్డివైపు వెళ్ళాను మెట్లనీన్ని మరమ్మతు చేశారెవరో. దొడ్లో కార్ఖానా; సున్నంబట్టీ, రంగులతొట్టెలు అంతా జనం. ధనాన్ని చూడాలంటే వాళ్ళుంటున్న మేడదగ్గరికి వెళ్ళాల్సిందే. ఏంచెయ్యను? వాళ్ళ మేడవైపువెళ్ళాను. అరుగు పక్కన సందుంది–దానిగుండా దొడ్లోకిదోవ. అటూ యిటూ తిరుగుతున్నాను. ఎవ్వరూ కనిపించరు. రోడ్డుమీద తాపీవాడు కనిపించి, 'ఆళ్ళందరూ ఎళ్ళిపొయ్యారు. యిక్కడ లేరండి' అన్నాడు.

'ఎక్కడున్నారు?'

'పోష్టాఫీసు వీధిలో యింట్లో కెళ్ళారు' అన్నాడు.

పైన గదిలో కిటికీలోంచి యెవళ్ళో చప్పట్లుకొట్టి 'ఇక్కడ', అన్నారు. కళ్ళు, నుదురు, జుట్టుమాత్రం కనిపించాయి. ధనం.

'అటు, అటు' అన్నట్టు చెయ్యి కదిపింది నేను దొడ్డి వైపు నళ్ళాను. మండువాలోంచి మేడమీదికి మెట్లున్నాయి. వెళ్ళి మెట్లకింద నుంచున్నాను. మెట్లపైన చివర ఆమె నిలబడివుంది.

'మేం మా యింట్లో కెళ్ళిపోయ్యాం. ఇది అద్దెకిచ్చేస్తున్నాం, మేజస్ట్రేటుగారికి' అన్నది—గాజులు, వుంగరాలు, దుద్దులు, నగలు బరువుగా మెరుస్తున్నాయి. కిందికి దిగు అన్నట్లు తల పంకించాను. నన్నే పైకి రమ్మంది. ఆమె భాగ్యవంతుల పిల్లని, నేను బీదవాణ్ణనీ, మా యిద్దరికీ మధ్య ఇరవై రెండు మెట్లున్నాయనీ, అప్పుడనిపించింది నాకు. ఆ మెట్లు ఆమె దిగదు; నేను ఎక్కలేను.

'నీ వుంగరం యిచ్చేద్దామని వచ్చాను' అన్నాను.

'ఏదీ?'

'ఇదిగో'

'ఇల్లా పడెయ్యి.'

'ఒక్క మెట్టు దిగు, పడేస్తాను.'

'నువ్వే వొకమెట్టు ఎక్కి పడెయ్యి' అన్నది.

'దిగవా?'

'కోపమా?'

దిగింది.

'మరో మెట్టు' అన్నాను.

'నువ్వు ఎక్కరాదూ?'

ఎక్కాను.

'పడెయ్యి' అన్నది.

'అన్ని వుంగరాలున్నాయి, చాలవూ?'

'ఇచ్చేస్తా నన్నావుగా.'

'కావాలన్నావుగా.'

'కావాలంటే యిచ్చేస్తావా?'

'ఓ'

మరో మెట్టు దిగింది.

'ఏది?'

'కావాలను' అన్నాను.

మరో మెట్టు ఎక్కాడు.

'నువ్వెందుకు దిగలేవు?' అన్నాను.

అధికారి కొండయ్యని ఆపుచేసి 'మాబాగా అడిగావు. ఆ ప్రశ్న నేను మా ఆవిణ్ని అడగలేకపోతున్నాను. ఆవిడా మెట్లు దిగదు,—పెద్దదే అనుకో,—అయినా, మొదటినుంచీ పెద్ద అవసరం వొస్తేగాని, మాటిమాటికి మెట్లుదిగేఅలవాటు లేదు—చెప్పు చెప్పు'— అన్నాడు. కొండయ్య చెప్పడం మొదలెట్టాడు.

'నువ్వెందుకు ఎక్కలేవు?' అంది.

'ఇది మీ మేడ. నువ్వే దిగాలి.'

మరొకటి దిగింది.

నేను మరొకటి ఎక్కాను.

'మా మేడైతే ఇన్నిమెట్లు ఎల్లా ఎక్కావు?' అంది ధనం.

'నీకోసం.'

'ఐతే అన్నిమెట్లూ ఎక్కిరాక నన్నెందుకు దిగమంటావు?'

'నాకోసం.'

'దిగానుగా, యింక చాలు.'

'నాకోసం కాదు, నువ్వు దిగింది' అన్నాను

'మరెందుకు?'

'నీకే తెలుసు'

అని వుంగరం పైకెత్తి చూపించాను. దాన్నిలాక్కో- డానికి గబగబా మిగత మెట్లన్నీ దిగి నా చేతిలో వుంగరాన్ని పట్టుకోబోయింది; నేను వుంగరాన్ని పై మెట్టుమీద పడేసేట్టు గిరవాటెట్టాను. తను గబగబా మెట్లెక్కి పైకెళ్ళి వుంగరాన్ని కిందపడేటట్టు గిరవాటెట్టింది. నేనూ మెట్లుదిగి కిందికి వచ్చేసి వుంగరం తీసుకున్నాను.

'నా కక్కర్లేదు వుంగరం, నువ్వే తీసుకో — నాకు బోలెడున్నాయి' అన్నది ధనం.

నాకు చాలా కోపంవొచ్చింది. ఏవేవో ఆలోచన లొచ్చాయి ఉంగరం తీసుకుని, మెట్లన్నీ ఎక్కి, పైకి ఆమె దగ్గరకే వెళ్ళాను.

'తీసుకో, యింద' అని నేలమీద పెట్టాను.

తీసుకోబోయింది. దాన్ని చేత్తో కిందికి నెట్టేశాను. తనూ ఎగిరి మెట్లమీద జారి, కిందికి పడిపోయింది; నేను పట్టు కున్నాను. నాపట్టు తప్పించేసి, మెట్లుదిగి, వుంగరంతీసుకుంది.'

ఇంతట్లో, యిద్దరూ యింటికి చేరుకున్నారు. అధికారి ఆ కుర్చీలో వాలిపొయ్యాడు 'హాసీ, ఆయన వాళ్ళోకెక్కి ఆనందంతో మూలుగుతోంది. కొండయ్య వెడతానని బైలు దేరాడు.

'కథ పూర్తికాకుండా ఎల్లా వెడతావు— ప్రొద్దున్న వెడుదువుగానిలే — ప్రొద్దున్న మా పెద్దమ్మాయికూడా

వొస్తుంది, చూసి పోమన్నగాని. పదిమందినీ కాటా కోసేసి, పెళ్ళి చెయ్యకుండా చదువు చెప్పిస్తున్నాను. చూచుకో నా మజా...' అన్నాడు అధికారి గర్వంగా. కొండయ్య వుండి పోయ్యాడు. 'తంబి' వొచ్చి పెట్రొమాక్సు లైటు వెలిగించాడు.

అధికారి, కొండయ్య కుర్చీలు దగ్గరకులాక్కుని, చదరంగం ఆటకి కూర్చున్నారు. అధికారి మొదలాట గెల్చాడు. కొండయ్యమీద ఆయనకి స్నేహభావం ఎక్కువైంది. తనతో ఆడి వోడిపోయినవాళ్ళంటే ఆయనకి చాలా ఆదరణ. మరో ఆటకి రమ్మన్నాడు. భార్యని కేకేసి, యీ ఆట చూడమన్నాడు ఆవిడ సమాధానం యివ్వలేదు. అధికారి విసుక్కుని, మొహం చిట్లించి, 'తంబిని' చూడమన్నాడు. 'నాకు బోలెడు పనుందండి' అని లోపలికి వెళ్ళిపొయ్యాడు వాడు. 'నీకర్మం' అని, పోనీ 'హానీ' యేనా చూస్తుందిలెమ్మని సమాధానపడి ఆటకి వుపక్రమించాడు అధికారి; తను ఎల్లానూ నెగ్గుతానన్న ధీమాతో, ఆలోచించకుండా గబగబ ఎత్తులు వేస్తున్నాడు.

'ఇదిగో, కొండయ్యా! యీసారి కళ్ళజోడు తీసేసి ఆడి, నీ ఆట కట్టేస్తాను' అన్నాడు. కొండయ్య అంగీకారం సూచిస్తూ నవ్వాడు. 'తంబి' పీటలూ అవీ వేసి, భోజనాల సన్నాహం చేస్తున్నాడు. ఆట ముగిసింది; అధికారి వోడిపొయ్యాడు. చాలా కోపంవొచ్చింది లోపల. చూడకపోవడం మంచిదనే అనుకుని తృప్తిపడ్డాడు. మేడమెట్లుండడంవల్ల

వుండే వుపకారాల్లో యిదొకటి అనుకున్నాను. ఎందుకో నవ్వాడు.

'ఏం నవ్వుతున్నావ్?' అన్నాను కొండయ్యని.

'ఏమీ లేదు, ఎందుకో జ్ఞాపకం లేదు... ...ఆ. ఆఁ, జ్ఞాపకంవొచ్చింది. ఆడదానికోసం నువ్వు మెట్లు ఎక్కలేని వాడవు, నా ఆటకట్టిస్తున్నావేమిటా అని నవ్వొచ్చింది' అన్నాడు.

కొండయ్యకూడా సమానంగా నవ్వాడు.

'ఏం! నవ్వుతున్నావు?' అన్నాడు అధికారి, భోజనానికి లేస్తూ.

'ఏమీ లేదు.'

'చెప్పు.'

'మీరు మెట్లు ఎక్కగలిగారు, కనకనే, ఆటలో వోడిపొయ్యారేమో!' అన్నాడు కొండయ్య.

'అసాధ్యుడవే, ఏమో అనుకున్నాను ఓసారి, శ్రీరంగం వెళ్ళినప్పుడు, మీనాక్షీ వొచ్చింది కదే—మీనాక్షి అంటే, మా జమీందారుగారి మనమరాలు—' అంటూ, చెప్పడం సాగించిన అధికారి భోజనానికి కూర్చోగానే, మీనాక్షి మాట మరచిపొయ్యారు. ఆయన చెప్పదలుచుకున్న గాథలతో ఏ మాసపత్రికనైనా సరే, రెండేళ్ళు నడపొచ్చు. భోజనంచేసి బైటికి చేరాము. కుర్చీలలో కూర్చున్నారు. అధికారి చుట్టముట్టించారు.

'కొండయ్యా, ఎక్కువ సంతోషం కలిగించే అనుభవం ఏమంటావు?' అని అడిగాను.

'ఏరకం అంటావు? భౌతికమా, మానసికమా?'

'ఏదో అంటావుగాని, రెండూ వొకటే అంటాను. మాంచి ఆకలిగా వున్నప్పుడు భోజనంచెయ్యడం భౌతిక మంటావా, మానసికమంటావా? నా కిందాక మంచి ఆక లేసింది. డాక్టర్లు ఘనపదార్థం మితంగా తినమని శాసించారు; ఆ శాసనాన్ని ధిక్కరించి బలంగా వేశాను; గొప్ప భౌతి కానందం కలిగింది—'

'డాక్టర్లని ధిక్కరించానుకదా అన్న దాంట్లో మాన సిక ఆనందం వుంది—అదే రెండింటికి తేడా—' అన్నాడు కొండయ్య.

'నువ్వుచెప్పినదాని ప్రకారం, వ్యావహారికంగా మనిషి ఏది చెయ్యకూడదో అది చెయ్యడంలో మనిషికి సంతోషం వుందని తేలింది. స్త్రీ మరోడిభార్యగా వున్నప్పుడే ఆకర్షణీ యంగా వుంటుంది. తాశీల్దారుభార్యని తీసుకో—

'మా అరుణ అంతకంటే వెయ్యిరెట్లు బాగుండేది. యిప్పుడంటే వార్ధక్యంవచ్చి, నాగరికత పరిమాణం యొక్క కొలతబద్దలా తయారైందిగాని, ... ఏమిటి మోజు? ... మరోడి భార్య కావడమే. ఓసారి యేమైందంటే-' అని మరోగాథ మొదలెట్టబోయ్యాడు అధికారి. ఈలోగా 'తంబి' వొచ్చి, 'వుదయం స్టేషన్‌కి బండి చెప్పిరావాలా' అని అడిగాడు.

'అమ్మగారేమన్నారు?'

'మిమ్మల్ని అడగమన్నారండి.'

'ఈ ఆడాళ్ళెలాగేనా తెలివైనవాళ్ళు కొండయ్యా. పరాయివాడెవడేనా యింట్లోవుంటే, వాళ్ళధోరణే వేరు.

వృత్తిపన్నాడు మొగుడి మొహాన ఏ గంజినీళ్ళు పోసినా, అతిథివాస్తే మ్రదసోపేతంగా చేస్తారు; ఒంటిగా వున్నప్పుడు మొగాడి బుర్రమీద తాళంకప్ప బద్దలైనా, పరాయివాడిముందు దాసానదాసురాలు బండి పంపించాలన్నందీ, అక్కర్లేందీ నేను నిర్ణయించాలట, చూడు చిత్రం; అందుకనే స్నేహితులో అని కొట్టుకుంటాను కుటుంబీకులు. వెళ్ళరా, వెళ్ళి మీ రెల్లాగంటే అల్లాచెయ్యమన్నారండని చెప్పి తగలడు? అని విసుక్కున్నాడు. 'తంబి' లోపలికి చక్కాపొయ్యాడు. మళ్ళా అధికారి కేదో జ్ఞాపకంవొచ్చింది.

'ఇంతకీ, ఏది గొప్ప అనుభవమో చెప్పావుకాదు' అన్నాడు.

'నేనేం చెప్పగలను; నా కనుభవం తక్కువ.'

'ఉన్నదాన్లోనే ఏది మంచిదో చెప్పవయ్యా, మహా–' అన్నాడు.

'మీరు చెప్పండి.'

'కూడదన్నపని చెయ్యడంలో నువ్వు చెప్పు.'

'చెయ్యగల్గినపని చెయ్యకపోడంలో?'

'నానత్తిలాగుంది. చెయ్యకపోడంలో అనుభవంఎక్కడుంది? నీది బైరాగివేదాంతం–ఐనా, నీ కేం తెలుస్తుందిపాపం!'

'అల్లా తోసెయ్యకండి మరి. చెయ్యకపోడం అంటే,– మనం ముందెప్పుడో చెయ్యగలం, చేస్తాంకదా అన్నధీమాలో సంతోషం లేదంటారా? దాన్నే 'ఆశ' అందాం ఒకేరకమైనవి అనేకమైన ఆశలుంటే, ఆదర్శం అవుతుంది. మానవుడి జీవితమంతా ఆదర్శంకోసంకాక, మరి దేనికోసం బ్రతుకు

తున్నా రంటారు! చచ్చిపోయింత ర్వాతకూడా, స్వర్గాని కెడతా మన్న ఆశవల్లనేగా, మన పూర్వులు రంభ, మేనక- స్వర్గాన్ని సృష్టించారు' అన్నాడు కొండయ్య నిదానంగా. అధికారి ఏ విషయంగురించీ తీవ్రంగా అట్టే ఆలోచించ లేదు. ఇదంతా గందరగోళంగా కనుపించింది.

'ఇదిగో కొండయ్యా, నేను ఆరేళ్ళు పత్రికలు నడి పాను. 'ఆశ,' 'ఆదర్శం' అనే అర్థశూన్యమైన మాటలతో పాఠకలోకాన్ని దగాచేస్తూవొచ్చాను. నాదగ్గర మాటలతో గారడీచెయ్యక, బుట్టలో పాముని చూపించు. మీనాక్షిని, జమీందారు మరదలును, కావాలంటే ధనం అను-వింటాను అంతేకాని-'

వాక్యం పూర్తిచెయ్యకుండా అధికారి లేచి లోపలి కెళ్ళి, మంచంమీది దిండుని తీసుకొని కుర్చీ వెనక వేసుకుని కూర్చున్నాడు.

'ఏది, యిప్పుడు చెప్పు. యిందాక ఎక్కడ వొదిలే శావో మాత్రం నన్ను అడగకు 'ఊ' కొట్టమనకు. రెండే షరతులు' అని అధికారి కళ్ళు మూసుకున్నాడు. కొండయ్య కథ చెప్పడం ప్రారంభించాడు.

'ధనం తన వుంగరాన్ని వేలుకి తగుల్చుకుని గర్వంగా చూస్తోంది. నేను బిగ్గరగా నవ్వాను. ధనం పైకిచూసింది.

'ఎందుకు నవ్వు?'

నే నేమీ సమాధానం చెప్పకుండా, వెకిలిగా నవ్వు తున్నాను.

ధనం పెదవులు చేతివేళ్లతో కలా కోపంతో వదిలాయి; కనుబొమ్మలు, యుద్ధానికి సిద్ధపడిన నల్లత్రాచులుమాదిరి వొంపు తిరిగాయి; చెక్కిళ్ళలోంచి రక్తం రహస్యంగా తొంగి చూసింది; ధనం నిజస్వరూపాన్ని ఆనాడు చూడగలిగాను. చటచటా మెట్లెక్కుతోంది — లోతుల్లోంచి విడిపోయి సంధ్యని తడుముకొస్తున్న వొంటికెరటంలా.

'ఎందుకు నవ్వు?'

మెట్లన్నీ ఎక్కి, పైకి నాదగ్గరికి వొచ్చేసింది... సంధ్య కోసం ఎగిరి, కొండకి తగిలి, పగిలింది కెరటం

'ఆ వుంగరం నీది కాదు' అన్నాను.

ధనం మొహం తెల్లారి వెలవెలబోయింది.

'మరెవరిది?' నీరసంగా కోడి కూసింది.

'నీది పారేశాను; ఇది మరోటి. అల్లాంటిదే కనుక్కో లేకపొయ్యావు' అన్నాను. ధనాన్ని ఏడిపించాలన్న నా సంకల్పం సిద్ధించినందుకు నేను చాలా గర్వపడ్డాను.

'ఎందుకు పారేశావు?'

'తొందరపడకు. పారెయ్యలేదు, అమ్మేశాను' అన్నాను.

చీకట్లో కాగడాలతో బంగారుగనులు త్రవ్వడానికి వెడుతున్న జనసమూహం అలజడి, ఆమె నేత్రాలలో కనిపించింది.

కోపంతో ఆమె రొమ్ములు వొణికిపోతున్నాయి. వేడి శ్వాస నా నవ్వుని బంధించింది. అరణ్యం అంటుకొని మహా వృక్షాలు కూలిపోతుంటే చూస్తున్నవాడిలా స్తంభించి పొయ్యాను.

'తీసుకో నీ వుంగరం' వేలునించి తీసేసి, నా బుజానికి తగిలేట్లుగా విసిరింది. మెట్లు దిగుతోంది.

'కోపమా?'

'... ...మరో మెట్టు దిగింది.

'నిజంగా అమ్మేశావనే?'

'... ...' మరొకటి.

"నగలన్నీ తీసేసినప్పుడు నిన్నుచూడాలనుంది" అన్నాను

'... ...'దిగుతోంది.

'నీ వుంగరం నీ కిచ్చేస్తా'.

'... ...'పూర్తిగా దిగి ధనం నడచి వెళ్ళియిపోయింది. మేడమెట్లు దిగుతుండగా ధనాన్ని మళ్ళా నే నెప్పుడూ చూడలేదు.'

అధికారి కుర్చీలోంచి లేచాడు; పెద్దగా ఆవులించాడు. తంబిని కేకేసి పక్కలువెయ్యమన్నాడు. తంబి స్టేషనుకి బండి చెప్పడానికి వెళ్ళి యింకా రాలేదు.

'మీకు నిద్రొస్తోన్నట్లుంది?' అన్నాడు కొండయ్య.

'ఎల్లా కనుక్కున్నావు? నీకథలో నువ్వు చెప్పదల్చు కున్న దేమిటా అని ఆలోచిస్తున్నాను' అన్నాడు అధికారి యథాలాపంగా.

'నాకథలో చెప్పదల్చుకున్నది ఏమీ లేదు—ఎందు కంటే యిది కథగాదు—'

"ఆగు, నాకు తెలుస్తోంది. మెట్లెక్కడంలో సంతోషం ఉత్సాహం ఉంటాయి. ఎక్కింతర్వాత వెనక్కి తిరిగిచూస్తే

'పోనీ యింతేనా' అనిపిస్తుంది ఎక్కడం పురోగమనానికి చిహ్నం. దిగడం పతనానికి చిహ్నం—తీరా ఎక్కినతర్వాత ఏమీ కనబడదు—ఏమో నే చెప్పేది నాకే గంద్రగోళంగా వుంది ... సరేకాని, నువ్వే చెప్పు' అని మళ్ళా కుర్చీలో జారబడ్డాడు, అధికారి.

కొండయ్య మళ్ళా ప్రారంభించాడు.

ధనంగారి రెండో మేడలోకి, ఎందువల్లనో రెండు నెల్ల వరకు మేజస్ట్రేటుగారు రాలేదు. ఆ రెండు నెలలూ నేను, ధనం, ఆ మెట్లమీద కల్సుకుంటూనే వున్నాం. రేపు నీ వుంగరం ఇచ్చేస్తానని మభ్యపెట్టి, రోజూ ధనాన్ని మేడ మెట్లదగ్గరికి రప్పించేవాణ్ని. నేనుచూస్తుండగానే, ధనం ఎదిగి పోయింది; మనస్సు మారిపోయింది; శరీరం కొత్తదనంతో విప్పారుకుంది. రోజురోజుకీ, వొకనగ తక్కువగా ఉండేది. నేను ధనానికి వొకచిత్రమైన ఆట నేర్పాను తను మెట్లపైన చివ్వర సింహాసనంమీద కూర్చున్న రాణీ; నేను మెట్లకింద నిలబడి ఆజ్ఞ లందుకునే వొక అల్పపౌరుణ్ణి. రోజురోజుకి, వొక మెట్టు పైకి ఎక్కి మాట్లాడటానికి రాణీగారు నాకు ఆజ్ఞ యిచ్చారు.

'ఏంకావాలి నీకు?' అంది రాణీగారు.

'తమ కిరీటం' అన్నాను.

జిగినీ తీసేసింది.

మరునాడు.

'ఛత్రం'

రవ్వలదుద్దులు తీసేసింది.

పదహారో తారీఖు రాత్రికి, నేను పదహారు మెట్లెక్కాను. ఇంక ఆమెకీ నాకూ మధ్య ఏడుమెట్లే వున్నాయి రాణీ సగ లక్ష్మి తీసేసింది; విరాగి-శిలాతయారైంది. నేనింకేం కోరను?

'ఏం కావాలి నీకు?' అంది రాణీ.

'మీ ప్రక్కన కూర్చోనివ్వాలి' అన్నాను.

'పైకి రా' అని ఆజ్ఞాపించింది.

'మీరు దిగిరండి.'

నవ్వింది వయ్యారంగా, రాణీ.

మా యిద్దరిమధ్యా రెండే మెట్లున్నాయి.

'ఏం కావాలి?'

'రాణీ! ఈ అల్పుడికి, అడగడానికి నోరాడడంలేదు.'

'భయంలేదు'

'నేనింక మెక్కలేను ఈ ఒక్క మెట్టూ మీరు దిగిరండి. నన్ను మీపక్కన కూర్చోనివ్వండి.'

'ఎందుకు?'

'ఆ ప్రశ్న వెయ్యగలిగిన మీకు సమాధానం తెలీకనా?' అన్నాను.

రాణీ అతి వయ్యారంగా నవ్వింది; పారవశ్యంతో నావళ్ళో పడుతుందేమో నక్షత్రంలా, అని రెండుచేతులూ చాచాను. కాని, రాణి పడలేదు; పైన బల్లులు కదిలి, బూజు నా నెత్తిన పడింది.

ఇంక మా యిద్దరి మధ్యనా, వొక్క మెట్టే వుంది. ఎన్నటికీ లేంది, ఆరోజు సాయంత్రం చీకటిపడే దాకా మెట్ల మీదే ఆడుకుంటున్నాం. రాణీ కళ్ళల్లో వెలుగుతప్ప అంతా

చీకటిగా వుంది. మాచుట్టూ, బోలెడు మెఱుగు పురుగులు విహారము చేస్తున్నాయి నక్షత్రాలమధ్య చందమామలా వుంది రాణీ.

'రాణీ, దిగిరావా?' అన్నా దీనంగా.

'నీ కేం కావాలి?'

'మీరే.'

'ఆ' అని గర్జించింది

'రెండు చేతులూ జాచాను. నా తలచుట్టూ చేతులు బిగించి, అప్రయత్నంగా తనవేపు లాక్కుంది నాచేతులు ఆమెనడుంచుట్టూ పెనవేసుకున్నాయి. ఆమె చేతులు నా చేతులమీదపడి వేళ్ళని తడిమి బిగిస్తున్నాయి. వల్లో చేపలాగ ఆ పల్చటి వేళ్ళు తన్నుకున్నాయి. తీసేసి, నాముఖాన్ని ముందుకి గెంటివేసింది. నేను చీకట్లో అటూఇటూ తడుముక్కాడాను ఆమె అక్కడ లేదు నా అరచేతుల్లో మెరుగు పురుగులు మండిపోయాయి ...'

ఇంతట్లో 'తంబి, చక్కావచ్చాడు. మెట్లగదిలో కొండయ్యకీ, మెట్లకింద హాల్లో అధికారికీ మంచాలేశాడు. పక్కలు పరిచాడు. రగ్గులువేశాడు. అధికారిని లేవదీశాడు. మెల్లిగా వెళ్ళి మంచంమీద పడ్డాడు. అధికారి 'రగ్గు' వొంటి మీదికి లాక్కున్నాడు; నెత్తికి మఫ్లర్ తగిల్చాడు.

'ఇదిగో కొండయ్యా, నే నిద్రపోతానుగాని, కథ చెప్పడం మానెయ్యకేం. మర్చిపోయ్యాను. తాశిల్దారుభార్య నడుం వెడల్పు ఎంతుంటుందని నీవూహ! నాగరికతంత' అని

బిగ్గరగా నవ్వుకుని 'తంబి'ని దీపం మెట్లవెనుక మూలగా పెట్టమన్నాడు.

'ఐతే, నువ్వు సంధ్యాకెరటాలు, నక్షత్రాలు, యివి లేకుండా చెప్పలేవూ కథ? అవన్నీతీసేస్తే చప్పగ తెముల్తుంది. నీకథలో ధనం తీసేసిందిగా వాస్తువులన్నీ! అబ్బో, నాజ్ఞాపక శక్తి బాగానేవుంది. మాఆవిడ అనుకున్నంతఅధ్వానంకాదు' అన్నాడు అధికారి కుడివైపు తిరిగి.

కొండయ్య మంచంమీద కూర్చున్నాడు, మెట్లకేసి చూస్తూ.

'ఏమండోయ్, మీయింట్లో మేడకి ఇరవైమూడు మెట్లున్నాయి' అన్నాడు కొండయ్య.

'అందుకా, రాగానే వాటికేసి దీక్షగా చూశావు. తెల్లారేక, నాజ్ఞాపకశక్తి మాఆవిడ మెచ్చుకునేటట్లు చేస్తాను. చెప్పు-' అని అధికారి అవులించాడు.

కొండయ్య మొదలెట్టాడు:

''అమర్నాడు ధనం రాలేదు. వారమైంది; నెలైంది; రాలేదు. నాలుగునెలలు గడిచింతర్వాత, ధనాన్నిచూశాను. ఈలోగా మేజస్ట్రీటుగారు ఆయింట్లోకి రావడం, బదిలీ అయి వెళ్ళిపోవడం, మేడ ఖాళీఅవడం జరిగిపోయింది. అప్రయత్నంగా ఆసాయంత్రం దొడ్డివేపు వెళ్లాను. దొడ్లో తాపీవాళ్లు పనిచేస్తున్నారు. నేను మెట్లదగ్గరకి వెళ్ళి కూర్చున్నాను. వెనకటి ఆట్లన్నీ జ్ఞప్తికొచ్చాయి. ధనంగారివాళ్ళందరూ ఆ వూళ్ళోంచి ఎక్కడికో వెళ్ళిపోయ్యారని నాకు తెలుసు కాని మళ్లా వొచ్చిన విషయం తెలీదు.

ఎవరో ముసలమ్మ అల్లా నేనున్నచోటు కొచ్చింది.

"ఎవరికోసం?"

"లోపలికెందుకు? తాపీమేస్త్రివాడివా?"

అవునన్నట్లు తల పంకించాను. ముసలమ్మ మెట్లెక్కి-వెళ్ళిపోయింది. ఏదో ఆలోచనలో పడ్డాను; ఎంతసేపైందో తెలీదు నాకు.

"ఎవరది?"

ఎప్పుడో స్వప్నంలో విన్నకంఠం అది. పైకిచూశాను.

మెట్లపైన చివర "రాణి" కనబడింది.-వొళ్ళంతా బంగారమే-వజ్రాలు ధగధగా మెరిసిపోతున్నాయి లక్ష్మి చూస్తే ఏమనుకుంటుందనిపించి, నా కళ్ళు తడిసినాయి.

"నువ్వా!"

ఎండలో ఇంద్రధనుస్సులా ఆమె కళ్ళు ఆశ్చర్యంతో విరిశాయి. నగలన్నీ 'అవును' అన్నట్లు నిశ్శబ్దంగా శబ్దించాయి. చిన్ని నల్లబొట్టు, దానిచుట్టూ ఎఱ్ఱబొట్టు, అసలా మొహమే, దేవకన్యకి బొట్టులాగుంది. చిన్న తెల్లపువ్వు; దానిచుట్టూ ఎఱ్ఱపువ్వులు; అసలా జడే, అప్సరస జడలో పువ్వులాగుంది.'

అధికారి, దగ్గి, కదిలాడు.

"అనే వొద్దన్నది."

కొండయ్య దీనంగా చూస్తూ, మాట వినిపించుకోకుండా చెప్పడం మొదలెట్టాడు.

"ధనం మెట్లుదిగుతుందనుకున్నాను. దిగలేదు. నేనలా నిలబడిపోయాను. ధనం అటూయిటూ చూసింది. లోపలి

కెళ్ళి, గదితలుపులు మూసేసి, మళ్ళావచ్చింది పైకి రమ్మన్నట్లు తలపంకించింది. నేను గబగబ మెట్లెక్కి పైకి వెళ్ళాను. మా యిద్దరికీ మధ్య వక్కటే మెట్టుంది.

'ఎందుకు?' అన్నాను.

'నువ్వెందుకొచ్చావ్?' అన్నది ధనం.

'నీకు తెలీదా?'

'ఏమో!'

'మరెందుకు రమ్మన్నావు?'

'నువ్వే వచ్చావు.'

'కాదు, మెట్లెక్కి.'

“నీకేం కావాలి-దబ్బున చెప్పు” అన్నది.

“అది నే నడగవలసిన ప్రశ్న” అన్నాను.

“అంతే!”

'ఆరోజున నీవుంగరం అమ్మేశానని అబద్ధమాడాను-. అమ్మలేదు. నాదగ్గరే వుంది. ఇచ్చేద్దామని వచ్చాను' అన్నాడు.

“ఏది?”

“నీ కింకా కావాలా?”

అని, వుంగరం గుప్పిట్లో వున్నట్లు గుప్పిడిబిగించి, చెయ్యి చాచాను.

“ఇయ్యి,” అన్నది.

“ఆ వొక్క మెట్టూ, దిగి, తీసుకో” అన్నాను.

ఆ వొక్క మెట్టు దిగి, నా ప్రక్కన నిలబడింది ధనం

“తీసుకో” అన్నాను, గుప్పిడి చూపిస్తూ.

"ఇదే" అని గుప్పెడి విప్పబోయింది.

నేను మెట్లుదిగుతున్నాను. తనూ దిగుతోంది. అన్ని మెట్లూ దిగిపోయ్యాం. గుప్పెడివిప్పి చూపించాను. అందులో వుంగరంవుంది. ధనం దాన్ని తీసుకుని ఆనందంతో పరిశీలించింది నేను ఆమె కళ్లల్లోకి తీవ్రంగా చూశాను. ఎంతో ఆశ, ఎంతో ఆకలి, ఎంతో మమకారం ఆమెకళ్ళల్లో కనిపించిన వుంగరంలో చూశాను. వాటిని ఏ మనిషీ పంచుకోలేడు. అదొక ప్రవాహం. అందులో నేనుగడ్డిపోచను; అదొకనిశీధి, నేనొక రంగుపురుగును; అదొకజ్వాల. నేను మసిని. నన్నుతోసేసింది ధనం—వుంగరం తీసుకుని గబ గబా మెట్లెక్కి పైకి వెళ్ళిపోయింది.

"ధనం" అని పిలిచాను. కిందనుంచి నా కంఠం నాకే ఆశ్చర్యం కలగజేసింది.

"నేను వెళ్ళిపోనా?" అని అడిగాను.

అర్థంలేని ప్రశ్న.

ఆమె యేమీ మాట్లాడలేదు.

'నేనొకటిచెప్పనా'? అన్నాను. ప్రశ్నార్థకంగాచూసింది.

"ఆరోజు సాయంత్రం నన్నుతోసేసి వెళ్ళిపోయ్యావు. ఎందుకో యిప్పుడు తెలిసింది. నా వేళ్ళుతడిమావు, ఉంగరం కనబడలేదు పాపం. అవునా?" అన్నాను.

'కాదు' అన్నట్టుగా తలపంకించింది.

'ఇప్పుడూ తోసేసి వెళ్ళిపోయ్యావు, ఎందుకో తెలిసింది. నీ వుంగరం దొరికింది. అవునా?' అన్నాను.

పుట్టలో ఇరుక్కు-పోయిన పాములా తన్నుకులాడింది. వుంగరం వేలునుంచి తటాలున తీసేసి కిందికి గిరవాటెట్టింది.

'తీసుకుపో—' అని, చరచరా వెళ్ళిపోయి, తలుపులు మూసేసుకుంది. స్వర్గం గడియలు ఎవరో వేసినట్లైంది. స్వర్గం బైటో, లోపలో మీరు నిర్ణయించాలి.'

అన్నాడు కొండయ్య. కాని అధికారి దగ్గర నుంచి సమాధానంలేదు. పెట్రోమాక్సు దీపం వొత్తి మండి కాలిపోయింది. అధికారి గుర్రురొద వినబడుతోంది సముద్రంలో తుపాను ఆకాశంలో మారుమ్రోగినట్లు. కొండయ్య కళ్ళు నులుముకొని, 'రగ్గు' ముసుకేసుకొని పడుకున్నాడు. 'హాసీ' అధికారిమంచంకిందికి చేరింది "తంబి" మెట్లమీద జేర్లబడి, నిద్రలో తూలుతున్నాడు. కొండయ్య తన చిటికిన వేలికున్న వుంగరం తడిమి చూసుకున్నాడు

తెల్లవారింది. తెరలా మేడచుట్టూ మంచుఆవరించింది. కిరణాలు, వెండి బాకుల్లా తెరని ఛేదిస్తున్నాయి. అధికారి, కొండయ్య ఫలహారం కాఫీ అయ్యాక అల్లా నడిచొద్దామని బైలుదేరారు.

'ఆగు. ఇవాళ మనం బైటికి వెళ్ళలేం. మా అమ్మాయొస్తుందిగా...' అన్నాడు అధికారి. రెండుచేతులూ వేడికోసం గట్టిగా నలుపుకుంటూ.

'ఈలోగా వొక్క-చదరంగం ఆట వేద్దాం-ఉన్నమాట చెప్పేస్తాను-నీ ఆట కట్టిస్తేగాని నాకు శాంతి వుండదు. అని పిలిచి, 'తంబి'ని అన్నీ సిద్ధం చెయ్యమన్నాడు. వాడు నాలుగూ అమర్చి, బండి తీసుకొని స్టేషన్‌కి వెళ్ళాడు.

'హా. కూర్చో ఇప్పుడు చెయ్యి-ఐతే - కొండయ్యా, రాత్రి నీకు బాగా నిద్రపట్టిందా? పాపం. నువ్వు కథ చెప్పుకుంటూపోతున్నావు. నేను కలలో వున్నాను-వందలకొలది, వేలకొలది మేడమెట్లు ఎక్కేస్తున్నట్లు. తీరా మెట్లన్నీ ఎక్కి చూస్తూ, కనిపించింది, 'తాశిల్దారు పెళ్ళాంపిపు' బడాయిగా నవ్వుతున్నాడు అధికారి.

'ఇన్, గట్టిగా మాట్లాడుతున్నా వేమిటి! మా ఆవిడ వింటుందిస్మా, ఆగు,మరచిపోయ్యాను మాఆవిడచూస్తుండగా ఆడాలి ఈసారి ఆట-' అని చప్పట్లుకొట్టి భార్యని కేకేశాడు.

ఆవిడ మెట్లపై లోపల గదిలోంచి

'ఎందుకు'? అన్నది.

'ఇక్కడ అంతర్జాతీయ ఆటగాళ్ళు చదరంగం ఆడుతున్నారు-చూడ్డానికి ఇదే ఆఖరుశకుణం. రాణి-నాకట్లో సాకె, రెండోసారి-పడిపోతున్నాయి, చూసించి మూంచి పంగిడీ ఎత్తులు-'

కొండయ్య అధికారి ఉత్సాహాన్ని, ఆత్రుతని చూసి బీదగా నవ్వాడు. మొదటి నాలుగైదు ఎత్తులలోనే యిద్దరి వుత్సాహం తగ్గింది

'రాకపోతే పోనీలే'- అన్నాడు ప్రపంచాన్ని సంబోధిస్తూ, అధికారి.

కొండయ్య గుర్రం ఒకటి అదనంగా చచ్చిపోయింది. మళ్ళా అధికారి హుషారుగా వింత గర్జనలు చేస్తూ, ఆట సాగిస్తున్నాడు. భార్యని పిలిచాడు.

'అరుణా, కరుణ రావా?' అన్నాడు.

అరుణ మెట్లపైని నిలబడి చూస్తోంది.

'మీరే యిల్లా రాకూడదూ?' అని మళ్ళా లోపలి కెళ్ళింది.

ఈలోగా 'హసీ' వొచ్చి బల్లకింద వృత్తిపుణ్యానికి గంతులు సాగించింది.

చదరంగంబల్ల కాళ్ళకి తన వెన్నుతో రాసింది. ఎగుడు దిగుడు కాళ్ళు కదలి, చదరంగంబల్ల కదిలి, ఆట చెదిరి పోయింది. అధికారి సంతోషంతో లేచి బలాన్ని డబ్బాలో వేసి, అట్ట మడిచేసి,

'కొండయ్యా, నాతో సమంగా మెట్లెక్క గలవా?'

'ఎందుకు?'

మనం పైకి వెళ్ళి ఆడుదాం.'

అధికారికి ఆటవిషయం చాలా 'కసిగా' వుంది. భార్య చూడగా, కొండయ్యఆట కట్టాలని.

'పోనీ, ఇద్దరం మెట్లెక్కుదాం. ఎవడు ముందెక్కితే వాళ్ళు ఆటగెల్చినట్లే' అన్నాడు అధికారి

'సరే' అన్నాడు కొండయ్య.

'రెడీ-వొకటి, దో, త్రీ- అని యిద్దరు పక్కపక్కనే మెట్లెక్కడం సాగించారు. ముందు కొండయ్య ఎక్కాడు; అధికారి రెండు మెట్లు వెనకపడ్డాడు.

'అరి కొండయ్యా, అసాధ్యుడవే- నిజంగా నెగ్గానను కోకు- ఏదో గెస్టువి కదా అని నేనే వెనకపడ్డాను' అంటూ, అధికారి తీవ్రంగా వగర్చడం మొదలెట్టాడు.

'అక్కడికీ, మీరు గెలిస్తేనే మర్యాదగా వుంటుందని నేను మెల్లిగానే ఎక్కుతున్నాను' అన్నాడు కొండయ్య.

'నువ్వు అసాధ్యుడవు కొండయ్యా' అని అధికారి కొంటెగా కన్ను మెదిపాడు.

'ఏదీ రా–ఆటకి' అన్నాడు.

కాని. ఏంలాభం! 'బలం' "అట్టా" మెట్లకింద వొదిలేసివొచ్చారు.

"నే వెళ్ళి తీసుకొస్తాలెండి" అని కొండయ్య, మెట్లు దిగి, తీసుకొచ్చాడు.

కొండయ్యకి ఆయాసం వొచ్చింది. వొగుర్పుని బలవంతంగా అణచివేసుకుంటున్నాడు. ఈలోగా అధికారి, బల్లమీద 'బలం' పేర్చి సిద్ధంచేసి, భార్యనిపిలిచాడు. కొండయ్య వెనకాలే, గదిలో అరుణ, తలుపులు కొంచెం దగ్గరగాజార్లవేసి, కుట్టుపని చేస్తో ఆట చూస్తోంది.

తొందరలో రెండు తప్పెత్తులేశాడుఅధికారి. దాంతో రెండు బంట్లు, ఏనుగా చచ్చిపొయ్యాయి.

'ఇవాళ ఎవరిమొహం చూశాను?– ఆ, ఆ–'తంబి'గాడి మొహం' అన్నాడు అధికారి దగ్గుతూ.

'పోనీ, మళ్లా ప్రారంభిద్దామా?'

'ఆగు. ఇందాకట్నుంచీ, ఏమిట్రా మర్చిపొయ్యాను, అని ఆలోచిస్తున్నా – ఇప్పుడు జ్ఞాపకంవచ్చింది. అమ్మాయి వొస్తూంటుందిపాటికి–నేను క్షురకర్మ చేసుకోవాలి.నువ్వూను. బ్రహ్మచారివి గనుక నీకు మరీ అవసరం. ముందు నే చేసుగొస్తాను. తరవాత, నువ్వు వెడుదువుగాని.'

లేచి, అధికారి ఎదురుగుండా గదిలోకి వెళ్ళాడు. నాలుగు నిమిషాలు గడిచిన తర్వాత బైటికొచ్చి కొండయ్య ముందు వో పత్రిక పడేసి-

ఇది చదువుకుంటూండు, - నాలుగురోజుల క్రితంది, అని అధికారి లోపలి కెళ్ళి, ఈవరం మొదలెట్టాడు.

'పత్రిక పాతదైతేనేం? నన్నడిగితే. ఇంట్లో వ్యాపారం చెడిపోయినప్పుడే, రాజకీయాలలో దూరబడటం.'

కొండయ్య మెట్లు దిగాలని యత్నించాడుగాని, వోపిక లేకపోయింది. పత్రిక చదవడం మొదలెట్టాడు. గదిలో ఎవరో కదిలినట్లయింది. అరుణ లేచి, తలుపులు దగ్గరగా మూసి, మళ్ళా కుట్టు మొదలెట్టింది. కొన్ని నిమిషాలు జరిగాయి. మళ్ళా ఎవరో గదిలో కదిలినట్లయింది. అరుణ లేచింది; తలుపులు కొంచెం తెరచి హాల్లోకి చూచింది. కొండయ్య కేసి చూసింది.

పాపం, కుతురు రాకకోసం ఎదురు చూస్తోంది కాబోలు అనుకున్నాడు కొండయ్య. మళ్ళా అరుణ, తలుపులు మూసేసి, తనపని చూసుకుంటోంది.

వీధిలో జట్కా-బండి నిలచిన అలజడైంది. 'తంబి' సామాన్లు వరండాలోకి జేరేశాడు. బండి వెనక్కి తిరిగింది. అధికారి కూతురు, కళ్యాణి, మెట్లగదిలోకొచ్చి, మెట్లకింద నిలబడి చూసి- 'నాన్నా' అని పిలిచింది. కళ్యాణి వయస్సు యిరవై లోపు. మెళ్ళో ముత్యాలు, పగడాలు వున్నాయి. పల్చటి, పొడుగాటి మనిషి, నిండైన కళ్ళు, గుండ్రటి మెడ

మెట్లమీదనుంచి చూస్తున్న కొండయ్యకి, కొంచెం పొట్టి మనిషిలా కనబడింది.

కళ్యాణి 'నాన్నా' అని, పైకిచూసింది. నాన్న కాదు, ఎవరో కొత్తమనిషి. గబగబ మెట్లెక్కుతోంది కొండయ్య చివాలున లేచి, రెండు మూడు మెట్లు తొందరగా దిగి, కల్యాణికోసం చేతులుచాచాడు. కల్యాణి, సముద్రంలో పిల్ల కెరటంలా, తనవేపు కొట్టుకొస్తోంది,—ఆమెలో. 'ఘనం' తళతళలు కనిపించాయి: 'రాణి' దర్జా రేగిపోయింది. అప్రయత్నంగా దిగిపోతున్నాడు. ఆమె, తూర్పుకి ఎగబాకిన సంధ్య చాయలా, వొచ్చేస్తోంది. ఇద్దరికీమధ్య రెండే మెట్లున్నాయి. కొండయ్యపంచ పాదంకింద పడింది; పట్టుజారి, ముందుకితూలి మెట్లమీద పడిపోయి—దొర్లి, మెట్లకింద పడిపోయాడు.

కళ్యాణి దొర్లిపోతున్న ఆ వ్యక్తిని ఆపలేకపోయింది. తను 'నాన్నా' 'అమ్మా' అని కేకలేసుకుంటూ—కిందికి దిగి, కొండయ్యని లేవదీయబోయింది. స్పృహలేకుండా పడిపోయాడు, కొండయ్య. 'తంబి' వొచ్చాడు; తల కిందికి దిండు తెచ్చాడు.

ఏమి టేమి టంటూ, అధికారి—మొహాన పూసిన సబ్బు తుడిచేసుకుంటూ—మెట్లపైనుంచి చూసి, చేతిలో కత్తి గిరవాటెట్టి, కిందికి దిగి వొచ్చాడు. కొండయ్యని చూశాడు. తంబిని కేకేసి బండితీసుకు రమ్మన్నాడు, ఆస్పత్రికి.

కళ్యాణి దిగాలుపడి కూర్చుండిపోయింది. నాడి పరీక్ష చేసింది. లాభంలేనట్టుగా పెదవులు చప్పరించి బిక్క మొహం పెట్టింది.

'ఎవరు, నాన్నా?' అంది కల్యాణి.

'దౌర్భాగ్యుడు' అన్నాడు అధికారి.

మళ్ళా 'అదేమిటే అల్లా అంటావు. వుండు, ఎవరైనా పిలుచుకొస్తాను. అరుణా! యిల్లా రా. కొండయ్యని చూసు, యిప్పుడే వొస్తా-' అని అధికారి, మూలనున్న కర్రతీసుకుని, బైటకి నడిచాడు.

'అమ్మా, రావే-నాకు భయంగావుంది' అందికల్యాణి

'తంబి' గ్లాసుతో నీళ్ళు తెచ్చాడు. కొండయ్యనుదుటికి మోకాలు చిప్పకీ పెద్దగాయాలు తగిలాయి. ఇంకా నెత్తురు కారడంలేదు.

అరుణ, మెట్లపైన నిలబడి, చూసింది.

కొండయ్యకళ్ళు సన్నగా తెరుచుకున్నాయి. నిశీధి తలుపులు తెరుచుకున్నట్లు- కల్యాణిమొహం నల్లగా వొంకరగా కనిపిస్తోంది. ధనం, రాణీ,సరస్వతి, అన్నీకలిసినమొహం. మెట్లపైకి చూడడానికియత్నిస్తున్నాడు. ఎన్నిమెట్లు?నాలుగు ఐదు. ఎనిమిది-ఇంకా పైకి-పది పదహారు-ఇరవై. కొండయ్య మెడపడిపోయింది. ఇరవైరెండు. అరుణపాదాలుకనిపించాయి. నిశీధితలుపులు మూసుకున్నాయి 'అయ్యో! చచ్చిపోయ్యాడు- ఇంకేముంది?-' అని కల్యాణి లేచి, పిచ్చిదానిలా, బైటికి, లోపలికి తిరుగుతోంది. అరుణ గదిలోకెళ్ళిపోయింది.

'తంబి' మేడమీది కెళ్ళాడు. అరుణ వాణ్ణి పిలిచి, ఏదో చెప్పింది. వాడు, కిందికి దిగి- కొండయ్యచేతులు సవరించి, చిటికినవేలుకున్న వుంగరాన్ని తీసేశాడు. కల్యాణి ఏమీతోచక, మెట్లెక్కి- అమ్మదగ్గర కెళ్ళింది గదిలోకి.

అరుణ కిటికీఅద్దంలోంచి ఆకాశంలోకి చూస్తోంది. అమ్మ వీరకొండయ్యతో కళ్ళు తుడుచుకోటం చూసింది కళ్యాణి.

'ఎందుకే అమ్మా-ఏడుస్తున్నట్లున్నావు?'

'ఏమీ లేదు.'

'ఎవరే ఆయన?'

'మీ నాన్నగారి స్నేహితుడు.

'పాపం!' అంది కల్యాణి.

వీధిలో బండి నిలిచింది.

అధికారి, కొండయ్య; మరోయిద్దరు ఆ బండిలో వెళ్ళి పోవడం చూశారు- తల్లీ, కూతురు.

అరుణ, గదిలోంచి యివతలి కొచ్చి, మేడమెట్లకేసి చూసింది. లోపలికెళ్ళి, తలుపు వేసుకుంది.

కల్యాణి వెనకాలే వొచ్చింది-

'ఇదంతా నామూలాన జరిగింది' అంది! అరుణ ఏమీ మాట్లాడలేదు. కల్యాణిమూలాన జరిగిందో, కల్యాణి కోసం జరిగిందో-ఆమెకే తెలియాలి.